క్లుప్తంగా

పశువులకు నేటి నుంచి టీకాలు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని పశువులకు బుధవారం నుంచి ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఇవ్వనున్నట్లు పశు వైద్యాధికారిణి డాక్టర్ మాలతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు తమ పశువులకు టీకాలు ఇప్పించాలని సూచించారు.

చందాలు సేకరించి అంత్యక్రియలు


లక్ష్మి (ఫైల్)

ఎల్కతుర్తి : మండలంలోని పెంచికలపేట గ్రామానికి చెందిన అదిమూలం లక్ష్మి(43) అనారోగ్యంతో మృతిచెందారు. కాగా నిరుపేద కుంటుంబం అవడంతో దహన సంస్కారాలకు గ్రామస్తులు చందాలు సేకరించి అంత్యక్రియలు పూర్తిచేశారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



నర్సంపేట : ఐక్యపోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఏఐసీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర కుమారస్వామి తెలిపారు. స్థానిక ఓంకార్ భవన్‌లో ఐరన్ హార్డ్‌వేర్, ప్లైవుడ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పాశం రాజిరెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశానికి కుమారస్వామి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తూ లేబర్ కోడ్‌లుగా మార్చి కార్పొరేట్ సంస్థలకు, పెట్టుబడిదారులకు లబ్ధి చేకూర్చుతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ తప్పుడు విధానాలతో ఎనిమిది గంటల పని విధానం, కనీస వేతనాలు, ఇతర ప్రయోజనాలు అమలు కావడం లేదన్నారు. కార్మిక శాఖ నిర్లక్ష్యంతో షాపుల్లో పని చేస్తున్న కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఇకనైనా షాపుల్లో పని చేసే కార్మికులకు హక్కులు, చట్టాలను అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఐక్యంగా హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని కోరారు. సమావేశంలో సంఘం గౌరవ సలహాదారు మహ్మద్ మాషుక్, ప్రధాన కార్యదర్శి కుడుతాల రాజు, కోశాధికారి సముద్రాల అశోక్, ఉపాధ్యక్షుడు ముత్యాల భద్రయ్య, నాయకులు శ్రీను, శ్రావణ్, మల్లయ్య, మణి, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలి


డాక్టర్ శ్రావణ్, ఏపీఎం ఝాన్సీ

నర్సంపేట : గర్భిణులు, బాలింతలు, తల్లులు, ఐదేళ్లలోపు చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో లభిస్తున్న సేవలను వినియోగించుకోవాలని డాక్టర్ శ్రావణ్, ఐకేపీ ఏపీఎం ఝాన్సీ, మహిళా బ్యాంకు అధ్యక్షురాలు పెండెం రాజేశ్వరి కోరారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా నర్సంపేట–2 అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని పాఖాల మహిళా బ్యాంకులో మంగళవారం పోషణ సంబరాలు, నషాముక్త్ భారత్ అభియాన్ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణ్, ఏపీఎం ఝాన్సీ, బ్యాంకు అధ్యక్షురాలు రాజేశ్వరి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, తల్లులు, ఐదేళ్లోలపు చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నట్టు తెలిపారు. ఆటపాటలతో చిన్నారుల సంపూర్ణ అభివృద్ధికి తోడ్పాటు అందుతోందన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనలో సమాజంలోని ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా కోఆర్డినేటర్ పావని డ్రగ్స్‌పై ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మహిళా బ్యాంకు లీగల్ అడ్వైజర్ పెండెం శివానంద్, సూపర్‌వైజర్ మాధవి, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి, ప్రాజెక్టు అధ్యక్షురాలు గొర్రె రాధ, ఏఎన్‌ఎం సునీత, ఆశావర్కర్లు మంజుల, ఇమ్మడి పద్మ, కీసరి విజయ, రంజిత్, అంగన్‌వాడీ యూనియన్ మండల అధ్యక్షురాలు దాసరి రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

కాల్‌నాయక్‌తండాలో..

నర్సంపేట రూరల్ : చెన్నారావుపేట మండలంలోని కాలనాయక్‌తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, తల్లులు, చిన్నారులకు పౌష్టికాహారం, చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అంగన్‌వాడీ టీచర్ కుంద రాహుల్‌వార్ అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, అంగన్‌వాడీ ఆయా సాంకీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తాగునీటి కటకట


మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న నల్లాలు


అంగన్‌వాడీ కేంద్రం వద్ద ప్లేట్లు శుభ్రపరుచుకుంటున్న విద్యార్థులు

- మరమ్మతుకు నోచుకోని చేతిపంపు
- పట్టించుకోని అధికారులు

వేలేరు : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వం మన ఊరు–మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పేరుతో సౌకర్యాల కల్పనకు శ్రీకారం చుట్టింది. కానీ క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో మన ఊరు–మన బడి పథకంలో భాగంగా విద్యార్థులకు నీటి సౌకర్యం కోసం నూతనంగా నీటి ట్యాంకు, నల్లాలు బిగించినా బోర్ సౌకర్యం కల్పించలేదు. చేతిపంపు కూడా సంవత్సరం క్రితమే పాడైపోవడంతో విద్యార్థులకు నీటి కటకట తప్పడం లేదు. చేతిపంపు సంవత్సరం క్రితం పాడైనా నేటికి మరమ్మతు చేయించలేదని విద్యార్థులు వాపోతున్నారు. కాగా పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం వద్దకు వెళ్లి చేతులు, ప్లేట్లు శుభ్రపరుచుకుంటున్నామని, ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి పాఠశాలకు నీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. అదే విధంగా చేతిపంపును కూడా బాగు చేయాలని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.


చేతిపంపుపై చెత్తడబ్బా పెట్టిన సిబ్బంది

గొడ్డలి, ఇనుపరాడ్లతో ఒకరిపై దాడి


చికిత్స పొందుతున్న సుధాకర్

శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో ఓ వ్యక్తిపై కొందరు గొడ్డలి, ఇనుపరాడ్లతో దాడికి దిగారు. ఈ సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ రంజిత్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన చంద సుధాకర్ వ్యవసాయం చేసుకుంటూ తన జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. సుధాకర్ ఇంటి పక్కనఉన్న చంద ప్రశాంత్‌తో ఇంటి స్థలం విషయంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగినప్పటికీ ప్రశాంత్ సుధాకర్‌తో గొడవ పడడం ఆపడం లేదు. ఈ క్రమంలో సుధాకర్‌ను చంపాలనే ఉద్దేశ్యంతో ప్రశాంత్ కుటుంబ సభ్యులు వేసుకున్న పథకం ప్రకారం ప్రశాంత్, అతడి తల్లి, చంద విజయ, అతడి అక్క, బావలు ఆకుతోట జ్యోతి, పూర్ణచందర్, మేనమామలు చింతపట్ల రాజు, కిట్టు కలిసి సుధాకర్ ఇంటిపైకి గొడ్డలి, ఇనుపరాడ్లు, కర్రలతో వెళ్లారు. ఇంటి బయట నిల్చున్న సుధాకర్ తలపై గొడ్డలితో, కాలుపై ఇనుపరాడ్లు, కర్రలతో దాడి చేసినట్లు సీఐ పేర్కొన్నారు. దీంతో సుధాకర్ భార్య చంద సంధ్య బయటికి వచ్చి తన భర్తపై దాడి చేయొద్దని అడ్డుపడగా సంధ్యను కూడా చేతులతో కొట్టినట్లు తెలిపారు. దీంతో చుట్టుపక్కలవారు ఆపే ప్రయత్నం చేస్తే వారిని చంపుతామంటూ బెదిరించి వెళ్లినట్లు తెలిపారు. సుధాకర్ తలపై, కాలిపై బలమైన గాయాలవడంతో వెంటనే 108 అంబులెన్స్ వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు చెప్పారు. సుధాకర్ భార్య సంధ్య ఫిర్యాదు మేరకు ప్రశాంత్, విజయ, జ్యోతి, పూర్ణచందర్, రాజు, కిట్టును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ఘనంగా కేవీపీఎస్ ఆవిర్భావం


జెండా ఆవిష్కరిస్తున్న సంపత్

ఐనవోలు : మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మంగళవారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) 28వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గబ్బెట రామ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్ కేవీపీఎస్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఏ దేశంలో లేని కుల వివక్ష భారత దేశంలోనే ఉందన్నారు. ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన లక్ష్యసాధనతో సంఘం ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో వృత్తి సంఘాల నాయకులు కాడబోయిన లింగయ్య, ఆలకుంట మల్లయ్య, మాదాసి యాకుబ్, శ్రీనివాస్, యాకయ్య, ఎల్లయ్య, అనిల్, కనకరాజు, సమ్మయ్య, నాగరాజు, శివప్రసాద్, కట్టయ్య, అనిల్ పాల్గొన్నారు.

అందుబాటులో సబ్సిడీ పరికరాలు

వేలేరు : రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేస్తున్న ఏఓ కవితా ఓ ప్రకటనలో తెలిపారు. రోటవేటర్లు 05, బ్యాటరి పంపులు 22, చేతి పంపులు 106, విత్తనాలతో పాటు ఎరువులు కలిపి వేసే యంత్రం 01, కల్టివేటర్స్ 07, పవర్ వీడర్ 01, బ్రష్‌కట్టర్ 01, పవర్ టిల్లర్ 01, గడ్డి కట్టలు కట్టే యంత్రం 01 సబ్సిడీలో ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, ట్రాక్టర్ ఆర్‌సీ జిరాక్స్‌లతో పాటు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో దరఖాస్తు ఫారాన్ని ఏఈఓలకు, ఏఓ కార్యాలయంలో అందించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

ఐనవోలు : 50 శాతం రాయితీపై రైతులకు ఉపయోగపడే పలు రకాల పనిముట్లు అందుబాటులో ఉన్నాయని ఏఓ సునీల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్ప్రేయర్లు, రోటావేటర్, సీడ్ డ్రిల్, కల్టివేటర్లు, పవర్ వీడర్, బ్రష్ కట్టర్, పవర్ టిల్లర్, స్ట్రా బేలర్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఆసక్తిగల రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోతో పాటు దరఖాస్తు ఫారాన్ని ఏఈఓలకు అందజేయాలని తెలిపారు.

యాగశాల నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న అర్చకులు, యాగ సమితి సభ్యులు

పరకాల : పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 3న కార్తీకమాస మహారుద్రయాగాన్ని వైభవంగా నిర్వహించేందుకు యాగ సమితి పనులు ప్రారంభించింది. పశువుల సంత ఆవరణలో మహా యాగశాల నిర్మాణానికి సంపత్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. యాగ సమితి అధ్యక్షుడు ఎర్రం లక్ష్మణ్, కన్వీనర్ రవి, ఆలయ చైర్మన్ రాజేశ్వర్‌రావు, కమిటీ సభ్యులు రవి, డాక్టర్ సరోజన, నవీన్, శ్రీరామ్, రవీందర్, శ్రీధర్, వీరస్వామి, జనార్దన్‌రావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రమాదకరంగా గుంత


దామెర క్రాస్ వద్ద ఏర్పడిన భారీ గుంత, అదుపుతప్పిన ద్విచక్రవాహనదారుడు

దామెర : మండల కేంద్రం సమీపంలోని ప్రతిమ కేన్సర్ ఆసుపత్రి ఎదుట హైదరాబాద్–భూపాలపట్నం జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు, మండల కేంద్రం నుంచి నగరానికి వెళ్లే ప్రధాన రహదారిపై భారీ గుంత ఏర్పడింది. దీంతో అటుగా వెళ్తున్న వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఆస్పత్రి నుంచి నిత్యం ప్రవహించే మురుగునీరు, వరద నీరు కారణంగా రోడ్డుపై గుంతలు ఏర్పడుతున్నట్లు వాహనదారులు ఆరోపిస్తున్నారు. అధికారులు చర్య తీసుకుని రోడ్డుపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. అలాగే ఆస్పత్రి నుంచి మురుగునీరు రోడ్డుపైకి ప్రవహించకుండా వెంటనే చర్య తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

పద్మశాలి సంఘం మండల కమిటీ ఎన్నిక



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామంలో అఖిల భారతీయ పద్మశాలి సంఘం మండల కమిటీ ఎన్నిక హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. మండల అధ్యక్షుడిగా ఊసకోయిల ప్రకాశ్, ఉపాధ్యక్షులుగా చిదురాల కిరణ్‌కుమార్, గాజుల చక్రపాణి, ప్రధాన కార్యదర్శిగా గాడిపల్లి హరీశ్, సహాయ కార్యదర్శిగా కొండబత్తిని ప్రభాకర్, మండల యూత్ అధ్యక్షుడిగా ఉడుత శ్రీనాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆనందం తెలిపారు. వీరి ఎన్నికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

‘ఇనగాల’కు డీసీసీ అధ్యక్ష పదవివ్వాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆత్మకూరు : ‘కుడా’ చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డికి డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని యూత్ కాంగ్రెస్ నాయకులు ఏఐసీసీ పరిశీలకుడు నవజ్యోతి పట్నాయక్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతి, యూత్ కాంగ్రెస్ ఆత్మకూరు మండల అధ్యక్షుడు సందీప్, దామెర మండల అధ్యక్షుడు సుధాకర్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శులు రాజు, శ్రవణ్, రాజు, ఉపాధ్యక్షుడు, సొసైటీ డైరెక్టర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాజేందర్ తదితరులు ఉన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం


జూజునూర్‌పల్లి గ్రామస్తులకు విరాళం అందజేస్తున్న పింగిలి ప్రదీప్‌రెడ్డి

కమలాపూర్ : మండలంలోని జూజునూర్‌పల్లిలో నూతనంగా నిర్మించనున్న పోచమ్మ దేవాలయ నిర్మాణానికి మండలంలోని శనిగారానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు పింగిలి ప్రదీప్‌రెడ్డి మంగళవారం రూ.10 వేలు విరాళం అందించారు. జూజునూర్‌పల్లికి చెందిన పలువురు గ్రామస్తులు పోచమ్మ దేవాలయ నిర్మాణానికి సాయం అందించాలని కోరారు. స్పందించిన ఆయన.. రూ.10 వేలు విరాళం అందజేసినట్లు ప్రదీప్‌రెడ్డి తెలిపారు.

మత ప్రచారంపై ఫిర్యాదు


ఫిర్యాదు కాపీని చూపిస్తున్న ఏబీవీపీ నాయకులు

వర్ధన్నపేట : పుస్కోస్ స్కూల్‌లో మత ప్రచారం చేశారంటూ స్థానిక ఏసీపీ కార్యాలయంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం వర్ధన్నపేట శాఖ అధ్యక్షుడు అజయ్ మాట్లాడారు. స్కూల్‌లో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి మత ప్రచారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు చర్చి ఫాదర్‌తో ప్రార్థన నేర్పించడం నిబంధనకు విరుద్ధమని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పుస్కోస్ స్కూల్ యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొల్ల అజయ్, అరుణ్ పాల్గొన్నారు.

పండుగపూట పస్తులేనా..?

- వేతనాల కోసం చేనేత కార్మికుల ఎదురుచూపు



చేనేత సంఘ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న చేనేత కార్మికులు

శాయంపేట : మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో పనిచేస్తున్న చేనేత కార్మికులకు 2 నెలల 15 రోజుల నుంచి వేతనాలు రాకపోవడంతో రానున్న దీపావళి పండుగకు పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడిందని చేనేత కార్మికులు సొసైటీ ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు పూల అయిలుమల్లు, ఆకునూరి జనార్దన్ మాట్లాడుతూ.. గత 2 నెలల 15 రోజులుగా వేతనాలు ఇవ్వడంలేదని, సొసైటీ పాలకవర్గ సభ్యులను అడిగితే డీసీసీ బ్యాంకు నుంచి డబ్బులు రావడం లేదని చెబుతున్నారని వాపోయారు. బ్యాంకు నుంచి డబ్బులు వచ్చిన తర్వాతే కార్మికులకు వేతనాలు ఇస్తామని తెలిపారని అన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద పండగ దసరా అని అలాంటి పండుగ వేల వేతనాలు ఇవ్వకుండా కేవలం రూ. 500 నుంచి రూ.1000 వరకు అనామతులు ఇచ్చి చేతులు దులుపుకొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం దీపావళి పండుగ వస్తుందని, ఈ పండుగకు కూడా వేతనాలు ఇవ్వలేమని, టెస్కో కార్యాలయానికి వెళ్దాం రండి అంటూ పాలకవర్గ సభ్యులు చెబుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా పాలకవర్గ సభ్యులు వెంటనే స్పందించి తమకు వేతనాలు ఇవ్వాలని నినాదాలు చేశారు.

ఇందిరమ్మ మోడల్‌హౌస్ త్వరగా పూర్తిచేయాలి

- జెడ్పీ సీఈఓ రవి


దామెర : మోడల్‌హౌస్‌ను పరిశీలిస్తున్న రవి

దామెర / నడికూడ : ఇందిరమ్మ మోడల్‌హౌస్ త్వరగా పూర్తిచేయాలని జెడ్పీ సీఈఓ రవి అన్నారు. దామెర మండల కేంద్రం, నడికూడ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ ఇల్లును మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీఓకు సూచించారు. అనంతరం నడికూడ ఎంపీడీఓ కార్యాలయాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ గుమ్మడి కల్పన, కార్యదర్శి మనోహర్, కారోబార్ బొబ్బిలితో పాటు తదితరులు ఉన్నారు.

ఆకుపచ్చ తెగులును నివారించాలి

- ఏఓ రాకేశ్


వరి పరిశీలిస్తున్న ఏఓ రాకేశ్

దామెర : వరిలో సంక్రమించే ఆకుపచ్చ తెగులును నివారించాలని ఏఓ రాకేశ్ రైతులకు సూచించారు. మండలంలోని పసరగొండలో మంగళవారం రైతులతో కలిసి వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వలన వరిలో బ్యాక్టీరియా, ఆకుపచ్చ తెగులును గమనించినట్లు చెప్పారు. దీంతో ఆకుల చివర నుంచి కింది వరకు పసుపు పచ్చగామారి తెగులు సోకిన బాగాలు ఎండిపోతాయని అన్నారు. ఈ వ్యాధి సోకితే సుమారు 80శాతం పంట నాశనం అవుతుందన్నారు. దీని నివారణకు స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ 90 శాతం, టెట్రాసైక్లోహైడ్రోక్లోరైడ్ 10 శాతం, 0.2 గ్రాములు, మాస్టర్‌కాప్ 400 ఎంఎల్ ఒక ఎకరానికి 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. 10 నుంచి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. ఆయన వెంట ఏఈఓ రామకృష్ణ, రైతులు సంతోశ్, రవి, సాంబయ్య, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు రాజు


బాకీకార్డు అందజేసి ప్రచారం చేస్తున్న రాజు

దామెర : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యిందని బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు మెంతుల రాజు అన్నారు. మండలంలోని పులుకుర్తిలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ బాకీకార్డుపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. హామీలు నెరవేర్చని కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం సాధించడం ఖాయమని అన్నారు. అందుకు కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముదిగొండ కృష్ణమూర్తి, గోవిందు అశోక్, ఎడ్ల గోపాల్‌తో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావొద్దు

- సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రహసిత్

కమలాపూర్ : పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావొద్దని సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్ సూచించారు. మండల కేంద్రంలోని ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల, కేరళ మోడల్ స్కూల్‌లో మంగళవారం మానసిక ఆరోగ్యం, మాదకద్రవ్యాల వినియోగంతో వచ్చే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించే దిశగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. అందుకు తగినట్లు కష్టపడి చదవాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు చెప్పుకొనేందుకు వెనుకాడొద్దని, నిద్రలేమి, చదువుపై టెన్షన్, ఆమారపు విధానాల్లో మార్పులు, ఎప్పుడూ విచారంగా ఉండడం వలన ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ఎవరికైనా మానసిక సమస్యలు తలెత్తితే 14416 నంబరులో టెలిమానస్‌కు కాల్ చేసి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం పల్లె దవాఖానా వైద్యుడు డాక్టర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు చుట్ట, బీడి, సిగరేట్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు, వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. పోగాకు, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజేపీ ప్రిన్సిపాల్ సౌజన్య, కేరళ మోడల్ స్కూల్ హెచ్‌ఎం దేవేందర్‌రావు, హెచ్‌ఈఓ రవీందర్, సోషల్ వర్కర్ నరేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పగలు వెలుగులు.. రాత్రి అంధకారం


పగలు వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ సెంట్రల్ లైటింగ్ పగలు వెలుగూ రాత్రి సమయంలో వెలుగకపోవడంతో అంధకారం అలుముకుంటోంది. దసరా పండుగా సందర్భంగా నూతన హైమాస్ట్ లైట్లు, సెన్సార్ సిస్టం, సెంట్రల్ లైటింగ్ సిస్టంకు గ్రామ పంచాయతీ అధికారులు మరమ్మతులు చేయించారు. ఈ క్రమంలో బస్టాండ్ ముందు బిగించిన హైమాస్ట్ లైట్లు సెన్సార్ సరిగా పనిచేయకపోవడంతో లైట్లు వెలగడం లేదు. అయితే ప్రధాన సెంటర్‌లో బిగించిన హైమాస్ట్ లైట్లు రాత్రి సమయంలో సరిగా వెలుగడం లేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమయానికనుకూలంగా లైట్లు వెలిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.